క్లుప్తంగా

ముచ్చింపులలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నిఖిల

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపుల ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే సబ్ సెంటర్‌కు రావాలని, తగిన పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. శిబిరంలో పీహెచ్‌ఎస్ కోమల, సూపర్‌వైజర్ కిషన్, ఏఎన్‌ఎం రజూనా, సుమలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక



నర్సంపేట: చెన్నారావుపేట మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడుప రమేశ్, ఉపాధ్యక్షుడిగా మారెల్లి చిన్నసాంబయ్య, కార్యదర్శిగా చిన్నపెల్లి భిక్షపతి, కోశాధికారిగా తోట రవిబాబు, యువజన సంఘం కోశాధికారిగా అడుప మహేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



నెక్కొండ : మండలంలోని అమీన్‌పేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు టై, బెల్టులు, పలకలు ఎంఈఓ రత్నమాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు రంగారావు, రవీందర్, వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

నల్లబెల్లి: మండల కేంద్రంలోని తిరుమల వైన్ షాపులోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడినట్లు ఎస్సై గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. షాపులో పని చేస్తున్న సేల్స్‌మెన్ వెండి సునీల్ మంగళవారం ఉదయం షాపు తెరిచి లోనికి వెళ్లగా కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.19,800 కనిపించలేదు. షాపులో పరిశీలించగా వెంటిలేటర్ పగులగొట్టి కనిపించింది. ఈ విషయాన్ని షాపు ఓనర్ శ్రీనివాస్‌కు తెలిపాడు. శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'కొండేటి'కి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పరామర్శ



శ్రీధర్‌ను పరామర్శిస్తున్న రాంచందర్‌రావు

వర్ధన్నపేట : ఇటీవల గాయపడి హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ను తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చిరువ్యాపారులకు గదులు కేటాయించాలి

పరకాల: రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న చిరువ్యాపారులకు తక్షణమే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి గదులు కేటాయించాని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. బుధవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మాకు బీజేపీ పట్టణ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ కొలనుపాభద్రయ్య, తిరుపతి, పురుషోత్తం ఉన్నారు.

గుంతలు ఇలా.. ప్రయాణం ఎలా ?

- ప్రమాదాలకు నిలయంగా నర్సంపేట–కొత్తగూడ రోడ్డు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రోడ్డుపై పడిన గుంతలు

ఖానాపురం : నిత్యం అనేక వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ప్రధాన రహదారి కాగా గుంతలమయంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అనేకమంది వాహనదారులు ఇప్పటికే గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు..స్వచ్ఛందంగా కొంతమంది మట్టిపోయించి ప్రమాదాలను అరికట్టే ప్రయత్నం చేసినా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో మళ్లీ గుంతలు పడ్డాయి.

ఖానాపురం మండలంలోని అయోధ్యనగర్ పరిధిలో ప్రధాన రహదారి భారీగా గుంతలమయమైంది. నర్సంపేట నుంచి కొత్తగూడ మండలానికి అయోధ్యనగర్, అశోక్‌నగర్ మీదుగా వాహనదారులు, ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. అయోధ్యనగర్ ప్రారంభం నుంచి అశోక్‌నగర్ వరకు రోడ్డంతా గుంతలు గుంతలుగా ఉంది. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలమయమైన దారి నుంచి కొత్తగూడ, గంగారం మండలాలకు మంత్రి సీతక్క సైతం వెళ్లిన సందర్భాలు సైతం ఉంటున్నాయి. ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారిపై వెళ్లే పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకొని గుంతలమయంగా మారిన ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



అయోధ్యనగర్‌లో ప్రధాన రహదారి గుంతలమయమైంది. నిత్యం జరిగే ప్రమాదాలను గమనించి రెండు నెలల క్రితం స్వతహాగా గుంతల్లో మట్టిపోయించాము. గుంతలు వెంటనే పూడ్చివేయాలి. – కూన లింగమూర్తి, అయోధ్యనగర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధు



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధు

నర్సంపేట : ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌళిక సదుపాయాలు కల్పించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ కాలేజీలో బుధవారం ఎంఎస్‌ఎఫ్ నాయకుడు చిలువేరి అరవింద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యా సంస్థల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యల సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై నిఘా పెంచి ఫీజుల నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని, డివిజన్ కేంద్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మౌనిక, శాంతి, ప్రియాంక, ఆకాష్, విష్ణు, వంశీ, రాజు, శివ, నిఖిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

సంగెం : తెలంగాణ రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విజయ్, బబ్లూ, రాకేష్, బంటి, సాయిచరణ్, సాయికృష్ణ, హరీశ్, స్పందన, సాజియా పాల్గొన్నారు.

'భూభారతి'తో వారసత్వ పట్టాలు జారీ



విరాసత్ పట్టా ఉత్తర్వులు అందజేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

సంగెం : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి ద్వారా రైతులకు వారసత్వ (విరాసత్) పట్టాలు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు వారసత్వ పట్టాలు చేసి పట్టాదారు ఉత్తర్వులు లబ్ధిదారులకు అందజేశారు. కాగా గత నెలలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని ఇన్నాళ్లు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇపుడు విరాసత్ కింద పట్టాలు జరుగుతుండడంతో ఇక దశలవారీగా తమ భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. భూభారతి ద్వారా తమకు న్యాయం జరుగుతుందని పట్టా ఉత్తర్వులు పొందిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

జన సురక్ష పథకాలపై అవగాహన



చెక్కులు పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

రాయపర్తి : మండలకేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులు, గ్రామస్తులకు జన సురక్ష పథకాలపై అవగాహన కల్పించినట్లు బ్యాంక్ మేనేజర్ పెద్దూరి అశోక్ తెలిపారు. బుధవారం రైతువేదికలో నోడల్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జీరో అకౌంట్(పీఎంజేడీవై) ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాయోజన, సురక్షభీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ ఖాతాదారుడు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ అందించే సేవలు, క్రాప్‌లోన్స్, గోల్డ్‌లోన్స్, డిపాజిట్, మహిళా సంఘాల రుణాలు, సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన చేసుకొని సహజ మరణం చెందిన కుటుంబ సభ్యులైన నామినీలు అయిన పెర్కవేడు, రాయపర్తికి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు ఎం.ప్రేమ్‌కుమార్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు రాగానే విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి: ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములు బోరు బావులకు అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతి రాగానే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గౌతమ్‌రెడ్డి బుధవారం తెలిపారు. సార్.. కరెంట్ ఇవ్వండి శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితం కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గౌతమ్‌రెడ్డి స్పందించారు. ఖానాపురం మండలంలో 78 మంది, నల్లబెల్లి మండలంలో 151 మంది గిరిజన రైతులు డీడీలు చెల్లించిన దరఖాస్తులకు అంచనాలు సిద్ధం చేసి మంజూరు చేసినట్లు తెలిపారు. కొంత మంది రైతులు ఓఆర్‌సీ చెల్లించలేదని, చెల్లింపులు పూర్తి చేసిన రైతుల అటవీ భూముల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అనుమతి పొందే ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతి పొందేందుకు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ సర్వేను పూర్తి చేసి వివరాలను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. వివరాలను ధ్రువీకరించేందుకు అవసరమైన డబ్బులను వారం క్రితమే డీడీ రూపంలో చెల్లించామన్నారు. ఈ ప్రక్రియను కార్పొరేట్ కార్యాలయానికి చెందిన ప్రాజెక్ట్ విభాగం సమీక్షిస్తోందని, అటవీ భూముల మార్పిడి అనుమతి లభించిన వెంటనే దరఖాస్తు చేసుకున్న రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పనులు చేపడుతామన్నారు.

రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలి



సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : భారత రాజ్యాంగంలోనే హక్కుల కోసం నిర్వహించే ఉద్యమానికి ప్రజలంతా ఆసరాగా నిలిచి ఈనెల 19న ఇల్లెందులో జరిగే రాష్ట్రస్థాయి అరుణోదయ సదస్సును జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర నాయకులు ఇట్టబోయిన రవి, గుర్రం అజయ్‌లు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో బుధవారం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో ప్రజల మౌళిక సమస్యలు పక్కకు పెట్టి కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ప్రజాసంపాదన దోచి పెడుతుందన్నారు.కలిసి ఉన్న ప్రజల మధ్య కులమతాలకు పేరుతో వైషమ్యాలు సృష్టిస్తూ దేశంలోని దళిత, మైనార్టీలపై దాడులు చేస్తూ ఫాసిస్టు పాలన కొనసాగిస్తుందని తెలిపారు. ప్రశ్నించే మేధావులను జైల్లో నిర్బంధిస్తున్నారన్నారు. కళాకారులుగా దీనిని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రవితేజ, ఉషాకిరణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చాలి

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాత ముగ్దుంపురంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖీర్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళలకు రూ.2500 లు ప్రతినెలా అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నప్పటికీ కనీసం ఆ పథకాన్ని అమలు చేయలేదన్నారు. అవి అందించాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి, బండారి రమేష్, అల్లి రవి, పోలేపల్లి రమేష్, మేకల సదానందం, తుత్తూరు రమేష్, మంచిక రాములు, దేవేందర్, దొనికెల చంద్రమౌళి, సంగెం శ్రీకాంత్, నాంపెల్లి సాంబయ్య, పత్రి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు జయ

నర్సంపేట : చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ అధ్యక్షతన 70 మందికి పైగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల నూతన అవసరాలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి, విద్యార్థుల హాజరు, పఠనాభ్యాస పురోగతి నాణ్యతపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరి సహకారం అవసరమన్నారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్ కోసం అందరూ కలిసి పని చేయాలని కోరారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహకారం అందిస్తామని, జిల్లాలోనే ఉత్తమ పాఠశాలలుగా అభివృద్ధి చేసేందుకు తగిన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బహుమతులు పొందడాన్ని ప్రశంసించారు. 40 మందికి పైగా నూతన విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో నమోదు కావడం, పదో తరగతి విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత కావడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాయపర్తి: ఇటీవల మృతి చెందిన మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన ఇల్లందుల మైసమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు చెవ్వు కాశీనాథం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం, ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు ఉన్నారు.

ఆషాఢ సంబురాలు



గోరింటాకును చూపిస్తున్న తల్లులు, పిల్లలు

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లి గ్రామం అంగన్‌వాడీ–2 సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ ఎండీ యాకూబీ ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢం సంబురాలను నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులకు గోరింటాకును వేయించి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు స్రవంతి, యాకాంత, సోని, భవాని, కవిత, విజయ, ఎల్లమ్మ, కలమ్మ, భవానిలు పాల్గొన్నారు.

వంట బకాయి బిల్లులు చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పనిభద్రత కల్పించాలని, రావాల్సిన బకాయిల బిల్లులు చెల్లించాలని కోరారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సూచించారు. అనంతరం డీఈఓ వాసంతికి వినతిపత్రం అందజేశారు.

7 ఇసుక ట్రాక్టర్ల సీజ్

వరంగల్ చౌరస్తా: వర్ధన్నపేట ల్యాబర్తి వాగులో అక్రమంగా తవ్వకాలు చేపడుతూ ఇసుక తరలిస్తున్న 7 ఇసుక ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన కోటగిరి శోభన్, రసూరి రాజ్‌కుమార్, కమాండ్ల లింగయ్య, కరీంపాషా, బైరి రాజు, యాకూబ్, చంద్రగూడెంకు చెందిన పిల్లి రవికుమార్, జమాండ్లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- నెక్కొండ ఎంఈఓ రత్నమాల



నెక్కొండ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

నెక్కొండ : ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ రత్నమాల హెచ్చరించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో పాఠ్యపుస్తకాలు ఎమ్మార్పీకి విక్రయించవచ్చన్నారు. ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దని, పరీక్షల ఫీజులు అధికంగా వసూలు చేయకూడదని ఆమె సూచించారు. మండలంలో సీబీఎస్‌సీ సిలబస్ చెబుతామంటూ ప్రచారం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక్కడ సీబీఎస్‌లో విద్యాబోధన లేదని ఆమె స్పష్టం చేశారు. అలాగే డబ్బులకు ఆశ పడి నకిలీ టీసీలు, స్టడీ సర్టిఫికెట్లు జారీ చేస్తే ఆయా పాఠశాల ప్రభుత్వ గుర్తింపు రద్దుతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా అధికారులకు నివేదిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు చల్లా నాగార్జున్‌రెడ్డి, కోడూరి అశోక్, శ్రీరాముల నాగేశ్వర్‌రావు, చల్లా యాకూబ్ రెడ్డి, కొత్త మధూకర్‌రెడ్డి, థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం : ఎంఈఓ



నల్లబెల్లి : విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మండల విద్యాధికారి అనురాధ

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్న గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎంఈఓ అనురాధ అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గత విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ప్రతిభ పురస్కారాలు ఎంఈఓ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సమావేశంలో ట్రస్టు నిర్వహకులు గంగిశెట్టి జగదీశ్వర్, హెచ్‌ఎం వసంత, సోషల్ వెల్ఫేర్ రిటైర్డు అధికారి సురేశ్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కుసుమ యాకాంబరం తల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందగా బుధవారం దశదిన కర్మ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఈరగాని విమల బుధవారం మృతి చెందగా అరూరి రమేశ్ అంతిమయాత్రలో పాల్గొనగా, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతంగౌడ్, మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, సీనియర్ నాయకులు ఉన్నారు.

మిరపనారుకు చీరల రక్షణ



మిరప గింజల నారుపోసి రంగుల జెండాలు కట్టి, చీరలు వేసిన రైతు

దుగ్గొండి: రంగు రంగుల జెండాలు.. చీరలు ఏమిటీ అనుకుంటున్నారా.. స్వామిరావుపల్లికి చెందిన యువరైతు దాసరి రాజు తన చేనులో మిరపతోట సాగు చేయడానికి మిరప విత్తనాల నారు పోసుకున్నాడు. ఎలాంటి పశువులు, పక్షులు రాకుండా చేను చుట్టూ రంగురంగుల జెండాలు పాతాడు. గింజలు నాటిన ఎత్తు మడులపై చీరలు పరిచాడు. ఇది దుగ్గొండి–నల్లబెల్లి ప్రధాన రహదారి పక్కనే కనిపిస్తుండడంతో అటుగా వెళ్తున్న వారంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు.